జగన్.. అంటే ఓ భరోసా


జగన్ పాలనను కొనియాడుతున్న వృద్ధురాలు


పాదయాత్రలో ఇస్త్రీ చేస్తున్న చందు

- జగనన్న పాలనలో ప్రజలందరికీ మేలు
- పేదలకు అందుబాటులోకి విద్య, వైద్యం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు

అక్కిరెడ్డిపాలెం: జగన్.. ఆ పేరే పేదలందరికీ ఎంతో భరోసా అని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. కుల, మత, వర్గాలకు అతీతంగా.. అర్హతే ప్రాతిపదికగా పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్, రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్ నగర్ కాలనీ, గుడివాడ అప్పన్నకాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాంనగర్‌లోని సీతారాముల ఆలయాన్ని సందర్శించారు. అనంతరం రజకుల వద్దకు వెళ్లి ఇస్త్రీ చేస్తూ వారిని ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పరంగా వర్తిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగారు. స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు.

విప్లవాత్మక సంస్కరణలు

పేదలకు ఉన్నత స్థాయి విద్య, వైద్యం కోసం విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారన్నారు. కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను, ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్న జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. సీఎం జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. పేదలకు అందని ద్రాక్షలా ఉన్న వైద్యాన్ని వారికి ఎంతో చేరువ చేశారన్నారు. ప్రతీ వార్డులో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని నిర్మించడంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం తదితర కార్యక్రమాల ద్వారా పేదల వైద్యానికి భరోసా కల్పించిన జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, ఈటి శ్యామలరావు, నంబారు రాజు, ఈటి సురేష్, రెడ్డిపల్లి చిట్టిబాబు, పోలవరపు శ్రీహరి, మానిటరింగ్ కమిటీ మెంబర్ కటికల కల్పన, గొంతిన సత్యవతి, సయ్యద్ హుస్సేన్, రవి, నందు తదితరులు పాల్గొన్నారు.

భద్రత నిర్ధారణలో కమ్యూనికేషన్ పాత్ర కీలకం

ఫ్యాక్టరీస్ డైరెక్టర్ చంద్రశేఖర వర్మ


స్టీల్‌ప్లాంట్ భద్రతా వేడుకల్లో ప్రసంగిస్తున్న ఫ్యాక్టరీస్ డైరెక్టర్ వర్మ


భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: భద్రతను నిర్ధారించడంలో సరైన కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగం డైరెక్టర్ డి.చంద్రశేఖర వర్మ అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఉక్కు ఎంపీ హాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గౌరవ అతిథిగా ప్రసంగించారు. ప్రతీ ఒక్కరు జీవితంలోని ప్రతీ అంశంలో, ప్రతీ కార్యక్రమంలో భద్రతను ఏకీకృతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రత విషయంలో సౌలభ్యం కంటే కచ్చితత్వానికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ డేటా అనలిటిక్స్, విస్తృతమైన శిక్షణ కోసం స్టీల్‌ప్లాంట్ సాంకేతికతను ఉపయోగిస్తోందన్నారు. మెరుగైన ఉత్పత్తి స్థాయి, ఉద్యోగుల భద్రత, శ్రేయస్సుకు యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. అంతకు ముందు వేదికపై ఉన్న వారు భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కోనవానిపాలెంలో స్థల వివాదం


దీక్ష చేస్తున్న కోనవానిపాలెం గ్రామస్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు కోనవానిపాలెంలో స్థల వివాదం రాజుకుంది. ఇక్కడ ఉన్న ఎంపీపీ పాఠశాలకు చెందిన స్థలాన్ని స్టీల్‌ప్లాంట్ భూసేకరణలో తమకు కేటాయించారంటూ కొందరు ఆ స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. 1990లో ఎంపీపీ పాఠశాలకు ఆ స్థలాన్ని కేటాయించారని చెప్పారు. ఆ స్థలాన్ని కాపాడాలని కోరుతూ రెండు రోజులుగా పాఠశాల ఆవరణ వద్ద దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్థలం విషయంలో పెదగంట్యాడ మండల తహసీల్దార్ సమగ్ర విచారణ జరపాలని కోరారు. కోనవానిపాలెం గ్రామస్తుల ఆందోళనకు వెంపళ్లనగర్, దళ్లివానిపాలెం వాసులు సంఘీభావం తెలిపారు.

క్లుప్తంగా

పోస్టల్ ద్వారా ఓటరు కార్డులు

గాజువాక : గాజువాక నియోజకవర్గంలో ఓటర్లకు పోస్టల్ ద్వారా ఓటరు కార్డులు పంపించేందుకు ఎన్నికల విభాగం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల్లో భాగంగా ఈ చర్యలను ప్రారంభించారు. మరో పది రోజుల్లో కార్డులను పోస్టల్ ద్వారా పంపించనున్నట్టు సిబ్బంది తెలిపారు. గాజువాకలో ప్రస్తుతం 3,27,520 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2.65 లక్షల మందికి గతంలోనే ఓటరు కార్డులను అందజేశారు. అందరికీ ఓటరు కార్డులను అందించాలన్న ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల మేరకు మొదటిగా 50 వేల మందికి పోస్టల్ ద్వారా కార్డులను అందించనున్నట్టు గాజువాక ఈఆర్వో డి.లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రతీ ఓటరుకు కార్డును అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లయన్స్ క్లబ్, ప్రథమ క్లినిక్‌ల సహకారంతో కొండయ్యవలసలోని విజ్ఞాన్ బ్రిలియంట్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 350 మందిని పరీక్షించగా, 43 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్టు విజన్ కేర్ నిర్వాహకుడు డాక్టర్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.జగదీష్, ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, ఎం.మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


మహిళలకు గ్యాస్ పొయ్యిలను పంపిణీ చేస్తున్న నిర్మలా కిశోర్, కరణంరెడ్డి

పెదగంట్యాడ: మహిళాభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిశోర్, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. 76వ వార్డు పరిధి బాలచెరువులోని శివాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ముందుగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉజ్వల పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోహిణి, జీలకర్ర భువనేశ్వరి, రమణ, కృష్ణంరాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ మెషీన్ బహూకరణ


ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ మెషీన్‌ను బహూకరిస్తున్న జీజా వల్సరాజ్

కూర్మన్నపాలెం : జీవీఎంసీ జోన్-6 పరిధిలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం వడ్లపూడి తిరుమలనగర్‌లో సోమవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఏపీఎఫ్ఆర్‌డబ్ల్యూఏఎస్) ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. తిరుమల నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జీజా వల్సరాజ్ సుమారు లక్ష రూపాయల విలువ గల ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ మెషీన్‌ను బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ప్రతినిధి ఉదయ్‌కుమార్ షరినామే, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి, జనరల్ సెక్రటరీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

1117వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉద్యమంలో దేశంలోని ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1117వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ చరిత్రలో ఓ చెరగని అధ్యాయమన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. అమరవీరుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరు సాగిస్తామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి


స్టీల్‌ప్లాంట్ పే సెక్షన్ ఇన్‌చార్జిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై నాయకులు సోమవారం ప్లాంట్‌లోని పే సెక్షన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టపడే కార్మికులకు ఇంతవరకు జీతాలు చెల్లించక పోవడం అన్యాయమన్నారు. జీతాల జాప్యం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పే సెక్షన్ ఇన్‌చార్జి రామ్‌ప్రసాద్‌ను కలిసి చర్చించారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, జి.వి.సుబ్బయ్య, ఎస్.ఎ.నాయుడు, బీ.ఎస్.రాజు, పి.వి.నగేష్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి


క్యాంటీన్ వంట గది పరిశీలిస్తున్న హెచ్ఆర్ డీజీఎం రాధిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్వహిస్తున్న క్యాంటీన్లలోని ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలని హెచ్ఆర్ డీజీఎం డి.రాధిక ఆదేశించారు. సోమవారం ఆమె హెచ్ఆర్ అధికారులతో కలసి, కోక్ఓవెన్స్ క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె క్యాంటీన్ స్టోర్ రూమ్, వంట గది పరిస్థితులను పరిశీలించారు. క్యాంటీన్ లోపల, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. క్యాంటీన్ సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. అక్కడకు వచ్చిన కార్మిక సంఘాల నాయకులు క్యాంటీన్, పరిసరాలపై పలు ఫిర్యాదు చేశారు. క్యాంటీన్ సౌకర్యాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు తాండ్ర కనకరాజు, ఎల్లేటి శ్రీనివాస్, కె.వి. రమణాజి, అప్పలనాయుడు, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ సారథ్యంలోనే 'నగరాలు'కు గుర్తింపు


సమావేశంలో పాల్గొన్న నగరాల కుల పెద్దలు

మధురవాడ: నగరాలు కులానికి ప్రత్యేక గుర్తింపునిచ్చి, ప్రోత్సహించింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని నగరాలు కుల పెద్దలు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు రెండు సార్లు చైర్మన్ పదవి మధురవాడ ప్రాంతానికి చెందినవారికి ఇచ్చారన్నారు. తమకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతగా బుధవారం మధురవాడ శిల్పారామం జాతరలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. నగరాలను బీసీ ఏలో చేర్చాలని, తమ కుల సామాజిక భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఎకరా స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నగరాలు కుల పెద్దలు పోతిన హనుమంతురావు, జగ్గపిల్లి అప్పలరాజు, పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, వాండ్రాసి రవి, పిళ్లా రమణ, పోతిన సుమన్ వెంకటరావు, నాగోతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు ప్రాధాన్యం


భద్రత ప్రతిజ్ఞ చేస్తున్న సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఇతర అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో 53వ జాతీయ భద్రత దినోత్సవ వేడుకలను సోమ వారం ఘనంగా నిర్వహించారు. దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్, టౌన్‌షిప్ నివాసితులతో ప్రాజెక్టు హెడ్ సిన్హా సేఫ్టీ వాక్ నిర్వహించి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సేఫ్టీ పార్క్‌లో జెండాను ఆవిష్కరించారు. ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ పర్యావరణం, పాలన శ్రేష్ఠత కోసం కాంట్రాక్టు కార్మికులకు దిశానిర్దేశం చేశారు. కాంట్రాక్టు కార్మికులంతా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రత సంస్కృతిని మెరుగుపర్చడానికి ప్రవర్తన ఆధారిత భద్రతను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో పరిశోధనలపై ఆసక్తి


నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో విశ్వనాథం తదితరులు

గాజువాక : వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంపొందుతుందని గాజువాక మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం అన్నారు. స్థానిక శక్తి స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. 300 మంది విద్యార్థులు 180 ప్రాజెక్టులను ఏర్పాటు చేసినట్టు పాఠశాల కరస్పాండెంట్ వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు, ఎన్నేటి రమణ, బలిరెడ్డి నాగేశ్వరరావు, జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

14న దుకాణాలకు వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్ – 4 పరిధిలో గల పలు దుకాణాలు అద్దెకు ఇచ్చేందుకు, మార్కెట్లలో ఆశీలు వసూలుకు ఈ నెల 14న వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. 31వ వార్డు డైక్స్‌ట్యాంక్, జగదాంబ, సూర్యాబాగ్, 35వ వార్డు పాత బస్టాండ్ ఫేజ్ – 2, 39వ వార్డు పద్మానగర్ వాణిజ్య సముదాయాలు, 37వ వార్డు అంబేడ్కర్ కల్యాణ మండపం అద్దెకు ఇచ్చేందుకు, 35వ వార్డు సర్దార్ వల్లభాయి పటేల్ (పూర్ణా మార్కెట్) మార్కెట్, రామకృష్ణా రైతుబజార్, రెల్లివీధి ఫిష్‌మార్కెట్ ఆశీలుకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు చెప్పారు. పైన పేర్కొన్న వాణిజ్య సముదాయాల్లో గల దుకాణాలు, కల్యాణ మండపం, 3 మార్కెట్లకు మూడేళ్ల కాలపరిమితికి కాంట్రాక్టు ఇచ్చేందుకు ఆ రోజు ఉదయం 11 గంటలకు జోన్ – 4 జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు/సంస్థలు వేలం పాటలో నిబంధనలకు లోబడి పాల్గొనాలని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరవాడ: మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తానాం గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు కోరారు.

విమ్స్‌లో ప్లాస్టిక్ సర్జరీ ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఈ నెల 6న ఉచిత ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేయనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం మొర్రి, డయాబెటిక్ ఫుట్, పురుషులలో రొమ్ము గ్రంధి పెరుగుదల, బోదకాలు, కిలాయిడ్ చికిత్సలు, కాలిన గాయాలు, విరిగిన చేతులు, కాళ్లు, వాస్కులర్ సమస్యలకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్లాస్టిక్ సర్జరీ, కాస్మోటిక్ సర్జరీలకు సంబంధించిన చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రూ.6 వేలు ఖరీదైన కలర్ డాప్లర్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

గణనాథుడికి ఘనంగా ఉండ్రాళ్ల పూజ


ఉండ్రాళ్లు, బెల్లం ముక్కలతో పూజలు అందుకున్న గణనాథుడు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-3 కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో సోమవారం రాత్రి ఉండ్రాళ్లు, బెల్లం ముక్కలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఆలయం 18వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామున పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఐ.వి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం హరినామ సంకీర్తనా బృందంచే లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

పాత గాజువాకలో గాంధీజీ విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక : మహాత్మా మదర్ థెరిసా ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ట్రస్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ట్రస్టు అధ్యక్షుడు జాగరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ చేస్తున్న అర్చకుడు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండిగరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రవేశం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి

డాబాగార్డెన్స్: ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 'కెరీర్ అపర్చునిటీ ఫర్ వుమెన్ ఇన్ ఇండియన్ నేవీ' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో స్త్రీ ప్రవేశించలేని రంగమంటూ ఏదీ లేదన్నారు. ఇండియన్ నేవీలో చేరి, దేశ సేవలో మాతృభూమి రుణం తీర్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు. లెఫ్టినెంట్ కమాండర్ ఆఫ్ ప్రిన్సిపల్ మెడికల్ ఆఫీసర్ అశ్వతీసుందరం మాట్లాడుతూ పదేళ్ల తర్వాత ఎలా వుండాలో విద్యార్థి దశలోనే నిర్ణయించుకుని, ఆ మేరకు కృషి చేయాలని సూచించారు. వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కేవీఎస్ నాగలక్ష్మి తదితరులు ప్రసంగించారు.